# మార్పు

**—ముద్దంశెట్టి హనుమంతరావు**

సుదర్శనం బి.కాం పాసై మూడేళ్ళ నుంచీ నిరుద్యోగిగానే ఉంటున్నాడు.

ఈ మూడేళ్ళలో ఎన్ని దరఖాస్తులు పెట్టినా ఏ ఒక్క ఉద్యోగమూ అతనికి అందుబాటులో రాకపోవడం, అతనిలో నిరాశా నిస్పృహల్ని నింపేసింది. దాంతో నిర్లక్ష్యం పెరిగింది.

సుదర్శనం, స్వతహాగా కాస్తంత ఉద్రేకపరుడు. చిన్నప్పట్నుంచీ అంతే. ఆత్మాభిమానం అధికం. ఎవరైనా తనపై అజమాయిషీ చెలాయించడానికి ప్రయత్నిస్తే అది తల్లిదండ్రులైనాసరే జీర్ణించుకోలేకపోయేవాడు. అది అతని శ్రేయస్సుకే అయినా, ఆ నిజాన్ని అవగాహన చేసుకునేవాడు కాదు.

కొడుకు మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకున్న తల్లిదండ్రులు, కొడుకుని నొప్పించే ప్రయత్నం ఎన్నడూ చేసేవారు కాదు.

సుదర్శనం మనస్తత్వ కారణంగా అతడికి స్నేహితులతోనూ, అప్పుడప్పుడు విభేదాలు వస్తూ ఉండేవి. వాళ్ళు దూరమవుతుండేవారు. అయినా సరే తన మనస్తత్వాన్ని మార్చుకోలేదు సుదర్శనం.

కొడుకు విపరీత మనస్తత్వానికి, కౌసల్య, హరనాధరావు మానసికంగా దిగులుపడుతుండేవారు. వాడు తన ప్రవర్తనని మార్చుకోపోతే జీవితంలో ఎలా నెగ్గుకు రాగలడా అన్న ఆవేదన వారి హృదయాల్లో కలవరం రేకెత్తించింది. దాంతోపాటు కొడుక్కి ఉద్యోగం దొరక్కపోవడం మరింతగా వారిని కృంగదీసింది. "కౌసల్యా! అబ్బాయికి ఉద్యోగమూ రావడంలేదు. దానికి తోడు వాడి దుందుడుకు మనస్తత్వం చూస్తుంటే నాకు భయమేస్తోంది. ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువాను. మనం వాడికి తల్లిదండ్రులం కాబట్టి సహిస్తూ వస్తున్నాము. ఇతరులకు అంత ఓర్పూ, సహనం ఉండదు కదా?" అంటూ హరనాధరావు భార్యతో చెప్పుకుని ఆవేదన చెందిన రోజులూ ఉన్నాయి.

కన్నతల్లిగా కడుపుతీపితో కౌసల్య ఏమీ అనకపోయినా భర్త చెప్పిన దాంట్లో ఎంతోనిజం వుందనిపించిందామెకి. అంతులేని వ్యధకు లోనైంది. ఒకటి,రెండు సార్లు కొడుకుతో తమ మనోవేదనని వ్యక్తంచేసింది కూడాను. కానీ, ఏంలాభం? ఆమె మాటలు అరణ్యరోదనలానే గాల్లో కలిసిపోయాయి. సుదర్శనం ఓ చిర్నవ్వు నవ్వేసి ఊరుకునేవాడు.

అలాగని సుదర్శనం వ్యక్తిపరంగా చెడ్డవాడేం కాదు. సహృదయుడు. అయితేనేం క్షణికావేశమే అతనిలో మచ్చలా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

** ** **

ఆరోజు హరనాధరావు బంధువొకాయన వాళ్ళింటికొచ్చాడు.

ఆయన పేరు కపిలేశ్వరరావు. మంచి హోదాలో వున్న వ్యక్తి. ఆయనంటే హరనాధరావుకి వల్లమాలిన గౌరవం. దానికి కారణం లేకపోలేదు. హరనాధరావు ఈరోజు ఇలా జీవితం సాగిస్తున్నాడూ అంటే అందుకు ముఖ్య కారకుడు కపిలేశ్వరరావే.

హరనాధరావు కొడుకు సుదర్శనంని కపిలేశ్వరరావుకి పరిచయం చేశాడు.

"కపిలేశ్వరం మావాడు మూడేళ్ళయి డిగ్రీ తీసుకుని ఉద్యోగం రాక ఇంట్లో కూచున్నాడు. వాణ్ణి నిరాశ పిశాచిలా పట్టుకు పీడిస్తోంది. వాడికి ఏదేనా ఓదారి నువ్వే చూపించాలి" అన్నాడు హరనాధరావు.

కపిలేశ్వరరావు సుదర్శనం కేసి చూశాడు. సుదర్శనం కాలుమీద కాలేసుకుని తనకేమీ పట్టనట్టే కూచున్నాడు.

అయితే కపిలేశ్వరరావుకి అతనిమీద కోపం రాలేదు. పైగా జాలేసింది. బహుశా ఉద్యోగం రాకపోవడం వల్లనే ప్రస్తుత వ్యవస్థ మీదా, మనుషుల మీదా ద్వేషం ఏర్పడి అలా నిర్లక్ష్య ధోరణిని అలవర్చుకున్నాడేమోనని సరిపెట్టుకున్నాడు కపిలేశ్వరరావు. "హరనాథ్ నా మిత్రుడొకడు ఓ ప్రైవేటు కంపెనీలో ఎం.డి.గా ఉన్నాడు. అతడితో నేను మాట్లాడతాన్లే. మీ వాడిచేత ఓ అప్లికేషన్ రాయించి ఇవ్వు" అన్నాడు కపిలేశ్వరరావు.

హరనాధరావు ఆనందానికి అవధుల్లేవు. అతనికి బాగా తెలుసు కపిలేశ్వరరావుకి ఎంత పరపతి ఉందో! అతను ప్రయత్నించాడూ అంటే ఆ పని జరిగిపోయినట్టే లెక్క!


"ఆ పాటి హామీ ఇస్తే చాలు కపిలేశ్వరం ఈరోజే మావాడి అప్లికేషన్ నీకు అందజేస్తాను. వాడికో దారిచూపి పుణ్యం గట్టుకో" అన్నాడు హరనాధరావు ఉత్సాహంగా.



సుదర్శనంకి తండ్రి మాటలు రుచించలేదు. తనకి ఉద్యోగం దొరుకుతుందో లేదోగాని ఆ కపిలేశ్వరరావుని అంతగా కాకాపట్టడం ఈ ఆధునిక యువకుడికి నచ్చలేదు. అతడికేం తెలుసు కాకా పట్టకపోతే ఈ రోజుల్లో ఏ పనీ సాధించలేమని?

అక్కణ్ణించి లేచి విసురుగా వెళ్ళిపోబోయాడు సుదర్శనం. హరనాధరావు కొడుకును ఉద్దేశించి అన్నాడు.

"ఒరేయ్ అబ్బాయ్! టైపు చేసిన అప్లికేషన్ కాపీలు ఉన్నాయి కదా ఒకదాని మీద సంతకం పెట్టి ఇవ్వు. ఎవరికి అడ్రసు చెయ్యాలో కపిలేశ్వరం మావయ్యే రాస్తారులే" అని.



'పౌడర్ బదులు వంటినిండా పుప్పొడి రాసుకుని రోజంతా గోక్కుంటూ కూర్చోవడం

సుదర్శనం నిర్లక్ష్యంగా నిష్క్రమించాడు ఆ గదిలోంచి.

కపిలేశ్వరరావు అంతా గమనిస్తూనే ఉన్నాడు. సుదర్శనం నిర్లక్ష్యం అతనికి ఆశ్చర్యం కలిగించ లేదు.

కపిలేశ్వరరావు అంతా గమనిస్తున్నట్టు గ్రహించాడు హరనాధరావు. అతని మనస్సు చివుక్కుమరిది. కొడుకు గురించి ఆయనేం అనుకుంటాడో నని అతని బాధ పాపం!

"ఈ రోజుల్లో కొందరు కుర్రాళ్ళ ప్రవర్తన కొన్ని సందర్భాల్లో ఎబ్బెట్టుగానే ఉంటోంది కపిలేశ్వరం. నీకు తెలీందేమీ కాదనుకో! అప్పుడప్పుడూ నాకనిపిస్తూ ఉంటుంది వీళ్ళు జీవితంలో ఎలా నెట్టుకు రాగలరా అని. కానీ ఏం చేస్తాం? మనం చెయ్యగలిగినంత చేసి వాళ్ళ అదృష్టానికి వాళ్ళని వదిలేయడం కన్నా ఇంకేం చెయ్యగలం?" అన్నాడు హరనాధరావు.

హరనాధరావు తన కొడుకుని దృష్టిలో పెట్టుకునే అలా వ్యాఖ్యానించాడని కపిలేశ్వరరావు అర్థం చేసుకున్నాడు.

"నువ్వు చెప్పింది అక్షరాలా నిజం హరనాథ్. ఈనాటి యువతలో నిరాశ బాగా పేరుకుపోయి వుండటం వల్లనే వాళ్ళ ప్రవర్తనలో మార్పు వచ్చిందని నా అభిప్రాయం" నన్నగా మందహాసం చేస్తూ అన్నాడు.

"సరిగ్గా ఊహించావు కపిలేశ్వరం" సన్నగా నవ్వుతూ అన్నాడు హరనాధరావు. కొడుకుని, ఆయన అపార్థం చేసుకోనందుకే ఆ సంతోషం.

సుదర్శనం అప్లికేషన్‌పై సంతకం పెట్టి తెచ్చి చ్చాడు తండ్రికి. ఇచ్చేసి వెంటనే అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

కొడుకు ప్రవర్తన మళ్ళీ ఇబ్బంది కలిగించింది హరనాధరావుకి. కానీ ఏం చెయ్యగలడు. కృత్రిమమైన ఓ చిరునవ్వుని తెచ్చి పెట్టుకున్నాడు పెదాలపై.

---

"మా వాడికి వల్లమాలిన బిడియం కపిలేశ్వరం. నువ్వు మరేమీ అనుకోకు. వాడికి ఏదో విధంగా సహాయం చెయ్యి. వాడి కాళ్ళమీద వాడు నిలబడితే నాకింకే చింతా ఉండదు" అంటూ కొడుకు అప్లికేషన్ని కపిలేశ్వరం చేతిలో పెట్టాడు హరనాధరావు.

"నా ప్రయత్నం నేను చేస్తాను హరనాథ్. నువ్వు నిశ్చింతగా ఉండు" అనేసి ఆ అప్లికేషన్ని తన బాగ్‌లో పెట్టుకున్నాడు కపిలేశ్వరం.

హరనాధరావు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

** ** **

కపిలేశ్వరరావు మాటిచ్చాడూ అంటే అది తప్పకుండా చేస్తాడు. అతనిలో ఆ నిజాయితీ ఉంది.

కపిలేశ్వరరావు ప్రయత్నం ఫలించి, సుదర్శనంకి ఓ ప్రైవేటు కంపెనీలో టైపిస్టు ఉద్యోగం వచ్చింది.

హరనాధరావు దంపతులు అంతులేని ఆనందాన్ని పొందారు.

సుదర్శనం సంతోషాన్ని పట్టలేకపోయాడు. కపిలేశ్వరరావుకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. నిరుద్యోగి బిరుదు తప్పించుకున్నందుకు తన కాళ్ళపై తాను నిలబడగలుగుతున్నందుకు మురిసిపోయాడు.

** ** **

ఆరోజే ఉద్యోగంలో చేరుతున్నాడు సుదర్శనం. అపాయింట్‌మెంట్ ఆర్డర్ని జేబులో పెట్టుకుని దేవుడి గది ముందు నిల్చుని మనసారా నమస్కారం చేసి వచ్చాడు.

ఎదురుగా నిల్చున్న తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తూ బయల్దేరబోయాడు.

హరనాధరావు కొడుకు భుజమ్మీద చేయి వేశాడు ఆప్యాయంగా.

"అబ్బాయ్ నువ్వు 'ఉద్యోగం' అనే నూతన పర్వంలోకి అడుగుపెడుతున్నావీ రోజు. ఇంతవరకూ నువ్వు చూసిన ప్రపంచం వేరు. ఈ ప్రపంచం వేరు. ఈ కొత్త ప్రపంచానికీ, నీకూ వీడని బంధం. నువ్వు పదవీ విరమణ చేసే వరకూ ఉంటుంది. చాలా జాగ్రత్తగా నీ బాధ్యతల్ని నిర్వర్తించుకోవాలి. పెద్దలను గౌరవించాలి. సహోద్యోగులతో సామరస్యంగా మెలుగుతూ ఉండాలి. అన్నింటికంటే ముఖ్యమైనది 'ఓర్పు'! అనుభవం వున్న వాణ్ణి గనక చెబుతున్నాను ఆపైన నీ ఇష్టం. నీకు శుభం కలగాలని మనసారా కోరుకుంటున్నాను" అంటూ చిన్న హితోపదేశాన్ని వినిపించి పంపించాడు హరనాధరావు.

సుదర్శనం లోలోన నవ్వుకున్నాడు. చిన్న పిల్లాడికి చెప్పినట్టు ఈ ఉపదేశాలేమిటా అనిపించిందతనికి. మందహాసంతో ముందుకు సాగిపోయాడు.

ఆరోజు టైపిస్టుగా జాయినయ్యాడు సుదర్శనం.

** ** **

రోజులు నిర్విరామంగా సాగిపోతున్నాయి.

సుదర్శనం 'ఉద్యోగ పర్వం'లో పదిహేను రోజులు ఇట్టే గడిచినాయి.

ఆరోజు అటెండరొచ్చి సుదర్శనం ముందు నుంచున్నాడు.

"ఏమిటోయ్?" అడిగాడు సుదర్శనం.


"అయ్యగారు రమ్మంటున్నారండీ" అన్జెప్పి వెళ్ళిపోయాడు అటెండరు.

సాధారణంగా కొత్తలో ఆఫీసరు ముందుకి వెళ్ళడమంటే ఎవరికైనా బెరుగ్గానే ఉంటుంది.

తనని ఎందుకు రమ్మన్నాడా అని ఆశ్చర్యపోయాడు సుదర్శనం. హెడ్ టైపిస్టు ప్రభాకరం కేసి చూశాడు.

"పిలుస్తున్నారటగా? వెళ్ళు ఏం భయంలేదు" అన్నాడు ప్రభాకరం

బితుకు బితుకుమంటూనే ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టాడు సుదర్శనం. ఆ గదిలోకి వెళ్ళడం అతనికి అదే మొదటిసారి.



"గుడ్ మార్నింగ్ సార్" సవినయంగా అన్నాడు.

"గుడ్ మార్నింగ్ ఈ లెటరు ఎవరు టైపు చేశారు? నువ్వేనా?" అంటూ ఆ ఫైలు సుదర్శనం కేసి విసిరాడు ఆఫీసరు.

కర్కశంగా, ఖంగుమంటున్న ఆఫీసరు గొంతు వినగానే గుండెల్లో చిన్న దడ పుట్టింది సుదర్శనంకి. అధికార దర్పంలో గొంతు ఇలా మారిపోతుందేమోననుకున్నాడు. టైపు చేసిన ఉత్తరాన్ని చూశాడు ఔను... తాను టైపు చేసిందే!

"ఔను సార్! నేనే టైపు చేశాను" అన్నాడు సుదర్శనం.

ఆఫీసరు, తీక్షణంగా చూశాడు.

"ఆఫీసు పనంటే, అంత తేలిక అనుకుంటున్నావటోయ్, అందులో టైపుపని ఎంత జాగ్రత్తగా ఉండాలి. అసలు, ఈ ఉత్తరాన్ని వాళ్లదగ్గర పెట్టుకునే టైపు చేశావా? ఎన్ని తప్పులున్నాయో చూడు" అన్నాడు కోపంగా.

సుదర్శనం అహం దెబ్బతింది. అతని మొహంలో అప్రయత్నంగా ఎర్రదనం చోటుచేసుకుంది. కాని, తండ్రి చెప్పిన హితోపదేశం చెవుల్లో గింగురుపెట్టింది. అతికష్టంమీద, తమాయించుకున్నాడు. "సారీ సర్! మళ్లీ టైపుచేసి తీసుకొస్తాను" అన్నాడు సవినయంగా.

అలా అంటుంటే, సుదర్శనం కళ్లల్లో నీరు చిప్పిలింది. ఇంతవరకూ యెవ్వరికీ తలవంచలేదు తను... కాని, ఇప్పుడు తల వంచినందుకేనేమో ఆ కన్నీళ్ళు!

"నాన్సెన్స్, ఇలా ప్రతీదీ రెండేసిసార్లు 'టైపు చేస్తే, ఇహ ఆఫీసుపని సాగినట్టే, రికమెండేషన్‌తో ఉద్యోగం సంపాదించగానే సరికాదు. వర్కు దగ్గరపెట్టుకుని పన్జెయ్యాలి. అండర్‌స్టాండ్...? గో... అండ్ గెటిట్ రీటైప్డ్" అన్నాడు ఆఫీసరు కటువుగానే.


సుదర్శనంకి, బాధతో పాటు కంటినిండా కోపం వచ్చింది. సహనం పట్టుతప్పుతోంది. అయితేనేం— అప్పుడే తండ్రిమాటలు, మళ్ళీ స్ఫురణకొచ్చాయి. నిగ్రహంతో ఫైలు పట్టుకుని సెక్షనుకొచ్చి, దిగాలుబడి కూచుండి పోయాడు. ఆఫీసరు ప్రవర్తన, అతని అహాన్ని దెబ్బతీసింది. అతని మెదడులో ఎన్నో ఆలోచనలు ముసురుకున్నయ్.

సుదర్శనం కేసి చూశాడు, ప్రభాకరం. ఆ యువకుడిలో అంతర్మథనం సాగుతోందని గ్రహించాడు. "ఏం జరిగింది సుదర్శనం?" అడిగాడు ప్రభాకరం.

సుదర్శనం, జరిగిందంతా చెప్పాడు, ఎంతో బాధపడుతూనే.

"ఇటువంటి ఉద్యోగం నాకక్కర్లేదండీ, రిజైన్ చేసేస్తాను" ఉద్రేకంతో అన్నాడు సుదర్శనం.

సుదర్శనం మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకున్నాడు ప్రభాకరం. అనుభవరాహిత్యంతో అంటోన్న మాటలని అతనికి తెలుసు. నవ్వుతూ, సుదర్శనం దగ్గరికొచ్చాడు.




"తొందరపడకు సుదర్శనం. నీలో ప్రవహిస్తున్నది ఉడుకురక్తం గనక ఆవేశాన్ని అరికట్టుకోలేక పోతున్నావు. నిజం చెప్పాలంటే మన ఆఫీసురుగారి కోపమంతా ఎందుకో తెలుసా? వాళ్ళ బామ్మర్దికి దొరకాల్సిన ఈ టైపిస్టు పోస్టుని కపిలేశ్వరరావు గారి రికమెండేషన్‌తో నువ్వు కొట్టేశావని, ఆ ఏడుపు డైరెక్ట్‌గా ఏడవలేక. ఈ విధంగా తన కోపాన్ని ప్రదర్శించుకుంటున్నాడు. ఆవేశంతో నువ్వు ఉద్యోగం వదులుకుంటే ఎవరికి నష్టమంటావు? నీకే! పోస్టుగ్రాడ్యుయేట్లు కూడా ఉద్యోగాలకోసం పడిగాపులు కాస్తోన్న ఈ గడ్డురోజుల్లో, నువ్వోసారి ఉద్యోగాన్ని వదులుకున్నావా, మళ్ళీ దాన్ని సంపాదించుకోవడం, దుస్సాధ్యం. ఇహ, ఆఫీసరు చేత చీవాట్లు తినడమంటావా, అది మామూలే, నువ్వు కపిలేశ్వరరావుగారి కాండిడేట్‌వని తెలుసును గాబట్టి, గురుడు ఘాటైన డోసులో చీవాట్లు పెట్టలేదుగాని లేకుంటే 'ఇడియెట్', 'రాస్కెల్' అన్న సందర్భాలూ ఉన్నయ్. కాని ఏం చేస్తాం? వాళ్ళ తిట్లే దీవెనల్లా భావించి వాటిని ఆ గదిలోనే వదిలేసి వచ్చేస్తూ ఉంటాం. ఉద్యోగం చెయ్యడమంటే, తల అమ్ముకున్నట్టేగా? మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందేగాని, వ్యక్తులుగా మనకి రాలేదేమోననిపిస్తోంది. అంచేత పిచ్చిపిచ్చి ఊహలు పెంచుకోకు. నిరుద్యోగిగా నిస్పృహతో బ్రతుకునీడ్చడంకంటే ఇటువంటి చీవాట్లు అప్పుడప్పుడూ జీర్ణించుకోవడం మంచిదేకదా? ఆ ఉత్తరాన్ని రీటైపు చెయ్యి. నేను చూస్తాలే..." అంటూ సుదర్శనంని సముదాయించాడు ప్రభాకరం.

సుదర్శనంకి ప్రభాకరం చెప్పిందాంట్లో అసత్యం లేదనిపించింది. అతనికి గతమంతా ఒక్కసారి స్మృతిపథంలో మెదిలింది. అప్పట్లో తల్లిదండ్రులేం చెప్పినా పట్టించుకునేవాడు కాదు. బాధ్యతారహితంగా ప్రవర్తించే వాడు. తన శ్రేయస్సుకోరి చెప్పిన హితవుల్ని సహితం పెడచెవిన పెట్టేవాడు. అవన్నీ ఇప్పుడు తల్చుకుంటుంటే, తాను ఎంత తప్పుచేశాడో, నిర్లక్ష్యంగా వ్యవహరించాడో ఇప్పుడు తెలిసొస్తోంది. తాను ఉద్యోగంలో చేరడానికి బైలుదేరిన తరుణంలో తండ్రి చెప్పిన మాటలు వేదవాక్కులే అనిపించినై. ఆఫీసరు ముందు అంత కోపంలోనూ తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు రావడంవల్లనే తాను తొందరపడకుండా నిగ్రహించుకోగలిగాడు. అందుకు, తండ్రికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

"జీవితం అంటే యేమిటో, దాన్ని ఎలా నడిపించుకోవాలో ఇప్పుడర్థమయ్యింది ప్రభాకరం గారూ! సరైన సమయంలో, సరైన సలహా ఇచ్చినందుకు మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో బోధపడ్డం లేదండీ!" అన్నాడు కృతజ్ఞతాభావం కళ్లల్లో ద్యోతకమవుతూ ఉంటే.


"దానికేంలే సుదర్శనం. నువ్వు యువకుడివి కొత్తగా ఆఫీసులో చేరినవాడివి. అందుకే చెప్పాల్సి వచ్చింది. నువ్వు అర్థం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది... ఆ ఉత్తరాన్ని రీటైపు చేసి నాకివ్వు" అంటూ ముసిముసి నవ్వుతో సుదర్శనం భుజంతట్టి తన సీటులోకి పోయి కూర్చున్నాడు.

సుదర్శనం ఆ ఉత్తరాన్ని రీటైపు చెయ్యడానికి ఉపక్రమించాడు.

ఆరోజు నుంచీ సుదర్శనంలో బాగా మార్పు వచ్చేసింది.

కొడుకులో వచ్చిన ఆ పరిణామానికి కౌసల్య, హరనాథరావు ఆశ్చర్యపోతూ, ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు కాదూమరి! వాళ్ళు కోరిందీ అదేగా!■

ఇంకోవైపు వాళ్ళు వాడుకుంటారు గురూ



-ము.

## అతిలౌక్యం

కాంట్రవర్సీని ప్రోత్సహించే ఓ రచయిత ఎక్కువగా అంత విమర్శ రాయని మరో రచయితని కలిశాడు.

"మీరు ఒకవైపే రాస్తారెందుకని..."

రెండువైపులా (కాగితానికి) రాస్తే కంపోజిటర్లు తిట్టుకుంటారని" అని అన్నాడా రచయిత.